క్లుప్తంగా

మొల్ల విగ్రహానికి ఎమ్మెల్యే అన్నా శంకుస్థాపన



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: స్థానిక తర్లుపాడు రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలోమొల్ల విగ్రహ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు బుధవారం భూమిపూజ చేశారు. మొల్ల జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మొల్ల విగ్రహ భూమిపూజ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ నర్సమ్మ, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

అంకాళమ్మ ఆలయంలో చోరీ



ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నాయక్

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట గ్రామ చెరువుకట్ట వద్ద అంకాళమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత దొంగలు చొరబడ్డారు. ఆలయంలోని హుండీని పగలగొట్టి సుమారు రూ.20 వేల నగదు అపహరించారని కమిటీ ప్రతినిధులు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయాన్ని సీఐ వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరిశీలించారు. దొంగలు ఆలయంలోని సీసీ కెమెరాలను పగలకొట్టి హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

నేడు వైఎస్సార్ చేయూత వారోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలో వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు గురువారం ఉదయం 9 గంటలకు పొదిలి మంజునాథ కల్యాణ మండపంలో చెక్కు అందిస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరవుతున్నట్లు తెలిపారు. ఐదో విడత చేయూత పథకం కింద లబ్ధిపొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొనాలని ఏపీఎం కోరారు.

ఎల్లమ్మ కుటుంబానికి నగదు అందజేత

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు గ్రామానికి చెందిన ఎబ్బిలి ఎల్లమ్మ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దర్శి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి కాపా రమణారెడ్డి వెళ్లి ఎల్లమ్మ కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. బూచేపల్లి కుటుంబానికి తాము రుణపడి ఉంటామని తెలిపారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

ముండ్లమూరు: గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (రూట్‌సెట్) ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రైనర్ బాపూజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జిల్లాకు చెందిన వారు మాత్రమే శిక్షణకు అర్హులని తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల మహిళలు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు 95733 63141 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల్లో ఐక్యతకు క్రీడలు దోహదం



విజేతలకు బహుమతులిస్తున్న వెన్నా ఇందిర

మార్కాపురం: క్రీడలతో విద్యార్థుల మధ్య ఐక్యత, స్నేహభావం ఏర్పడుతుందని తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇందిర ఇంజినీరింగ్ కాలేజీలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. యువ కేంద్రం ప్రతినిధి శ్రీధర సాయిసుబ్బారావు, ప్రిన్సిపాల్ ఉషా ఈశ్వరన్, హెచ్‌ఓడీలు మల్లేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఈ నెల 31వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారులకు వచ్చే నెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులు 150 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 75 రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

టీడీపీ అధినేత చంద్రబాబు మేకవన్నె పులి

- నీరు–చెట్టు పేరుతో రూ.కోట్లు స్వాహా చేశారు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్



వైఎస్సార్ చేయుత చెక్కులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: చంద్రబాబు మేకవన్నె పులి లాంటి వాడని, ఎన్నో ఆశలు చూపి మహిళలకు మోసం చేసే మనస్తత్వం కలిగిన వ్యక్తని, అటువంటి వ్యక్తి అధికారం కోసం మరో ఇద్దరిని తోడు కలుపుకొని ప్రజల్లోకి వస్తున్నాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. బుధవారం స్థానిక వైష్ణవి గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఆయన నీరు–చెట్టు, మట్టి పేరుతో కోట్లాది రూపాయలు కొళ్లగొట్టారని, దీంతో రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఉపయోగం కలగలేదన్నారు. రాష్ట్రంలోనే లాభాల బాటలో నడుస్తున్న చిత్తూరు పాల కేంద్రాన్ని నష్టాల్లోకి నెట్టి దాన్ని మూతవేయించిన ఘనుడు చంద్రబాబు అని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ డైరీకి అప్పజెప్పి పూర్వవైభవాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. నారా వారికి చెందిన హెరిటేజ్ షేర్లు 2 శాతం అమ్మితే వేల కోట్లు వస్తాయని స్వయంగా ఆయన సతీమణి ప్రకటించిందని, కేవల ఎకరం పొలంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయనకు ఇంత డబ్బు ఏ విధంగా సంక్రమించిందో మహిళలు అర్థం చేసుకోవాలన్నారు. ఆయన ప్రధాన వ్యాపారం రాజకీయమని, అందుకు ఎటువంటి మోసాలకైనా ఒడిగట్టగలడని ఆయన తీవ్రంగా విమర్శించారు. పేద కుటుంబాలను ఆదుకోవడం కోసమే తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలనుకుంటోందని, ఎన్నికల ముందు జగనన్న ఇచ్చిన వాగ్దాలన్నీ అమలు పరిచారని, పథకాలన్నీ మహిళలకు దక్కే విధంగా చర్యలు తీసుకొని వారి కుటుంబాలు నిలదొక్కుకునే విధంగా చేశాడన్నారు. తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆయన సీఎం అయితేనే ఇంకా మెరుగైన పథకాలు మీ ముంగిటకు చేరుతాయని పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత 4వ విడత కింద 12,027 మంది మహిళలకు రూ. 78.43 కోట్ల చెక్కులు ఆయన అందజేశారు. ఇరిగేషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీలు కిరణ్‌గౌడ్, గురవయ్య, జెడ్పీటీసీలు విజయభాస్కర్, చలమారెడ్డి, జాన్‌పాల్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌సెల్ సభ్యుడు కోటేశ్వరరావు, మహిళా నాయకురాలు పల్లె సరళ, డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, ఎంపీడీవోలు వైవీ నాగేశ్వరప్రసాద్, సాంబశివరావు, రాజ్‌కుమార్, నాసర్‌రెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం–డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఏపీఎంలు ఎడ్వర్డ్, వెంకటయ్య, పోలయ్య, శ్రీనివాసులు, కృపమ్మ పాల్గొన్నారు.

వడ్డెరలను గుర్తించింది జగనన్నే

- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన 50 కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తించి వారిని రాజకీయాల్లో స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో పుల్లలచెరువు మండలానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయకష్టం చేసుకొని జీవించే వడ్డెరలను జగనన్న అక్కున చేర్చుకున్నారని, వారు ఆర్థికంగా బలపడటానికి కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. చంద్రగిరి ఏసురత్నానికి తొలుత వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారని, ఆయన ఎన్నికల్లో ఓడిపోయినా గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవి ఇచ్చి వడ్డెరల్లో ఆత్మవిశ్వాసం పెంచారన్నారు. వడ్డెర సామాజిక వర్గం రాజకీయాల్లో నిలదొక్కుకోవాలన్న ఉద్దేశంతో ఏసురత్నానికి ఎమ్మెల్సీ పదవీ ఇచ్చి గౌరవించారని చెప్పారు. 40 సంవత్సరాలుగా టీడీపీ జెండాను మోసిన వడ్డెరలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకున్నాడే తప్ప వారిని ఏ విధంగా ఆదుకోలేక పోయాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన స్ఫూర్తితో సిద్ధనపాలెంలో ఉన్న 100 కుటుంబాల్లో 50 కుటుంబాలు పచ్చనేతలకు గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరారని, మిగిలిన 50 కుటుంబాలు సిద్ధనపాలెంలో జరిగే కార్యక్రమంలో చేరుతారని ఆ గ్రామ యువ నాయకుడు గుంజే నాగమల్లేశ్వరరావు తెలిపారు. టీడీపీకి చెందిన తిరుపతి ఏడుకొండలు, చిన్న మన్నెయ్య, పెద్ద మన్నెయ్య, వేముల చరణ్‌తేజ, బత్తుల బాలయ్య, జి.ముక్కటిలకు చంద్రశేఖర్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ మంద లాజర్, ఎం.బాలయోగయ్య, గడ్డం సుబ్బయ్య, ఆళ్ల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం జగనన్న నేర్పిన పాఠం



మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న తాటిపర్తి

యర్రగొండపాలెం: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేర్పిన పాఠం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆర్థిక సాయం అందచేశారు. తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, నలుగురు పిల్లలను పోషించుకోవడం కష్టంగా ఉందని, తనకు ప్రభుత్వ పరంగా పింఛన్ ఇప్పించాలని పుల్లలచెరువు మండలంలోని సిద్ధనపాలేనికి చెందిన మక్కెన వెంకటరమణ అనే మహిళ కోరింది. స్పందించిన ఆయన పింఛన్ మంజూరయ్యే వరకు తాను నెలకు రూ.3 వేల ప్రకారం అందజేస్తానని, వెంటనే ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. కష్టాల్లో ఉన్న 14 మందికి ప్రతి నెలా ఆర్థిక సాయం అందజేస్తున్నామని, నియోజకవర్గంలో ఎవరైనా కష్టాల్లో ఉండి పింఛన్ మంజూరు కావడంలో ఆలస్యం అయితే తన కార్యాలయం నుంచి పింఛన్ తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని తాటిపర్తి స్పష్టం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఆళ్ల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన



సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు ఎంపీపీ గుమ్మా పద్మజ, సర్పంచ్ చిత్తూరి హారికలు బుధవారం శంకుస్థాపన చేశారు. కొత్త మసీదు వీధిలో 25 లక్షల రూపాయల సచివాలయ నిధులతో డ్రైనేజీ కాలువల నిర్మాణం, రోడ్డు నిర్మాణంతో పాటు పోస్టాఫీసు బజార్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణం, రూ.60 లక్షల మండల పరిషత్ స్పెషల్ గ్రాంట్ నిధులతో శ్రీశైలం రహదారిలోని సాయిబాబా గుడి ఎదురు రోడ్డు, గంగోత్రి వాటర్ ప్లాంట్ రోడ్డు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు యక్కంటి వెంకటేశ్వరెడ్డి రోడ్డు, తిమ్మాపురం ఎస్సీ పాలెం రోడ్డులో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఎంపీపీ గుమ్మా పద్మజ తెలిపారు. బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి దూదేకుల రసూల్, మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణ, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, అల్లు రమణారెడ్డి, చంద్రకాంత్‌నాయక్, ఆంజనేయరెడ్డి, రమణయ్య, పల్లా మల్లికార్జున పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

కొమరోలు : మహిళలు అన్ని రంగాల్లో ముందుంటూ ఆదర్శంగా నిలవాలని జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద లక్ష్మీ శ్రీనివాస ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర టైలర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షురాలు ప్రమీలారెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు తిరుపతిరాజు, సుభాని, నిర్వాహకురాలు అంజలి పాల్గొన్నారు.

శివన్నకు సూర్యాభిషేకం



శివలింగంపై ప్రసరిస్తున్న సూర్య కిరణాలు

బేస్తవారిపేట: మోక్షగుండంలోని పురాతన ముక్తీశ్వర క్షేత్రం గర్భగుడిలోని శివలింగాన్ని సూర్యకిరణాలు అభిషేకిస్తున్నాయి. ఫాల్గుణ మాసంలో సూర్యకిరణాలు గర్భగుడిలోకి ప్రవేశించడం ప్రత్యేకత అని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. సాయంత్రం 5.15 గంటల నుంచి 6 గంటల వరకు శివలింగంపై, 5.15 నుంచి 6.15 గంటల వరకు అమ్మవారి ప్రతిమపై కిరణాలు పడుతున్నాయి. మోక్షగుండానికి రెండు కిలోమీటర్ల దూరంలోని తూర్పుకొండ లోయలో ఈ క్షేత్రం ఉంది. నలువైపులా కొండలు, పచ్చని చెట్లు, కోనేరులతో ఆహ్లాదకర వాతావరణం ఉండటం క్షేత్రానికి ఆకర్షణ.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఫైర్ డిటెక్షన్ ప్రాజెక్ట్

బేస్తవారిపేట: అర్ధవీడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు టీసీఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ నిర్వహించిన కాంప్యూటేషనల్ థింకింగ్–ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ పోటీల్లో సత్తాచాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 'ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్, అలారం సిస్టం' ఎంపిక చేశారు. పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు జె.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఐదుగురు విద్యార్థులు టీమ్ లీడర్ 9వ తరగతి విద్యార్థి పి.కోటేశ్వరరావు ప్రాజెక్ట్‌ను రూపొందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్ట్‌ను రూపొందించిన విద్యార్థులను, గైడ్ ఉపాధ్యాయుడిని కళాశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

విద్యుత్ సమస్యలుంటే నేరుగా సంప్రదించాలి

కొమరోలు: రైతులకు, విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా విద్యుత్ శాఖ సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాలని ఎంపీపీ కామూరి అమూల్య, జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. కొమరోలులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు షేక్ సుభానీ, తిరుమలరాజు, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటోనగర్ అభివృద్ధికి సహకరించండి

- ఎమ్మెల్యే అన్నా, జంకెను కలిసిన ప్రతినిధులు



ఎమ్మెల్యే అన్నాతో మాట్లాడుతున్న గుంటక, బాషా

మార్కాపురం: మార్కాపురం శివారులోని దరిమడుగు సమీపంలో ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలని ఆటోనగర్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, అధ్యక్షుడు ఎంఆర్‌కే బాషా, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డిని కలిసి బుధవారం విజ్ఞప్తి చేశారు. ఆటో నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు తాటిపర్తి పరామర్శ

పెద్దారవీడు: మండలంలోని తంగిరాలపల్లి లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గోపిదేశి ఆవులక్క, అనారోగ్య కారణంగా తలపాటి రమేష్ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను వై.పాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పరామర్శించారు. రమేష్ భార్య కుమారికి రూ.10 వేలు, ఆవులక్క తమ్ముడు చిన్నగంగయ్యకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఏపీ ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచ్‌లు తోకల నాగమల్లేశ్వరి, పాలగిరి రామాంజనేయరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య, ఉప సర్పంచ్ పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, చలిపిండి నారాయణరెడ్డి ఉన్నారు.

గ్రంథాలయంలో మొల్ల జయంతి

గిద్దలూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో తొలి తెలుగు రచయిత్రి మొల్ల జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. మొల్లా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకురాలు ఎస్ఎం ప్రసన్నకుమారి మొల్ల జీవిత చరిత్రను పాఠకులకు వివరించారు.

పుల్లలచెరువు కార్యదర్శిగా శివకోటేశ్వరరావు

పుల్లలచెరువు: పుల్లలచెరువు పంచాయతీ కార్యదర్శిగా శివకోటేశ్వరావును నియమించినట్లు ఎంపీడీవో విలియమ్స్ తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న బాలునాయక్ ఏసీబీ అధికారుల వలలో చిక్కుకోవడంతో శివను ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నియమించినట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 15వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. 15న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలను ఫోన్‌లో తెలపవచ్చునన్నారు. ఫోన్ నంబర్ 99592 25702.

రేషన్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

కంభం: ఇంటింటికీ రేషన్ కార్యక్రమం ద్వారా ప్రజలు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి వేచి చూడకుండా ఇంటి వద్దే రేషన్ తీసుకుంటున్నారని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్డుదారుడికి ఎటువంటి సమస్యలు లేకుండా రేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గ్యాస్ డీలర్లు వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నరసింహులు అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ రామయ్య తెలిపారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



బూచేపల్లిని గజమాలతో సన్మానిస్తున్న తురకపాలెం గ్రామస్తులు

ముండ్లమూరు: పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డితోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని తురకపాలెం, కొత్తూరు గ్రామాల్లో బుధవారం రాత్రి మన ఊరికి, మన శివన్న ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచేందుకు పదవులు ఉన్నా లేకున్నా బూచేపల్లి కుటుంబం ప్రజల క్షేమం కోసం పనిచేస్తోందన్నారు. 20 ఏళ్లుగా తమ కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్న తురకపాలెం గ్రామ ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే రుణపడి ఉంటామన్నారు. రాబోయే ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాదరెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని వెంకాయమ్మ కోరారు. అనంతరం కొత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కుమ్మిత వెంకటరెడ్డి, నాగేంద్రంల కుమార్తె శ్రీలక్ష్మి వెంకట ప్రసన్నను బూచేపల్లి వెంకాయమ్మ,శివప్రసాదరెడ్డిలు ఆశీర్వదించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రూ.44 లక్షల సచివాలయం, రూ.24 లక్షల రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. మండల ఇన్‌చార్జులు నరసింహారెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఆదాం షరీఫ్, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, జి.మోషే, సొసైటీ అధ్యక్షులు కుమ్మిత జయరామిరెడ్డి, యాడిక యలమందారెడ్డి, గుంటి గంగా భవాని ఆలయ మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్బీకేను ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఉడుముల

అర్థవీడు (కంభం): రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని నియోజకవర్గ సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని రంగాపురంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందించడమే కాకుండా వ్యవసాయంలో రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉన్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ చెన్ను విజయ, మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి జగన్



పొదిలిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కృష్ణచైతన్య

పొదిలి రూరల్: ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన వెంటనే అమలు చేసి మడమ తిప్పని నేతగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు అన్నా కృష్ణ చైతన్య పేర్కొన్నారు. బుధవారం పొదిలి నగర పంచాయతీలోని విశ్వనాథపురంలో 11, 17 వార్డుల్లో వెంకటేశ్వర థియేటరు వీధి, జూనియర్ కాలేజీ రోడ్, ప్రకాశ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న జగనన్నను మరోమారు సీఎంగా చేసుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పార్టీ నేతలు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, జి శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, సాయి రాజేశ్వరరావు, కె.నరసింహారావు, గుజ్జుల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి

ముండ్లమూరు: రైతులు, బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించి బ్యాంకు లావాదేవీలను అభివృద్ధి చేసుకోవాలని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి అన్నారు. మండల కేంద్రం ముండ్లమూరులో బుధవారం పీడీసీసీ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ముండ్లమూరు సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన పంట రుణాలు సకాలంలో అందించేందుకు బ్యాంకు సేవలను గ్రామ స్థాయికి అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నందున ఈ అవకాశాన్ని ప్రజలు, మహిళలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు సీఈఓ కోటిరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శివపార్వతి, సిబ్బంది రాము, వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు గాదె నాసరరెడ్డి, చింతల కృష్ణారెడ్డి, కుమ్మిత వెంకటరెడ్డి, వెంకట్రావు, డైరెక్టర్ జిల్లెలమూడి శివయ్య, సిబ్బంది ఈశ్వర్, నరసయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బిగ్ స్క్రీన్ ప్రచారం



బిగ్ స్క్రీన్‌లో తాడిపర్తి ప్రసంగాన్ని వింటున్న మండల ప్రజలు

పెద్దదోర్నాల: రాష్ట్రంలో ఎన్నికల వేడి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. గ్రామాల్లో ప్రచార పర్వాలు జోరందుకుంటున్నాయి. యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిపర్తి చంద్రశేఖర్ వినూత్నంగా బిగ్ స్క్రీన్‌తో తన ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్‌లో ఈ ప్రచార వాహనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. బొలెరో వాహనంలో జనరేటర్, స్టీరియో సౌండ్ సిస్టంతో పాటు భారీ ఎత్తున టెలివిజన్ స్క్రీన్‌తో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిపర్తి పరిచయ కార్యక్రమాలతో పాటు తాడిపర్తి ప్రసంగం, ఇటీవల వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ ప్రాంతంలో సొరంగాలను జాతికి అంకితం చేసిన దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ప్రచార వాహనంలో వచ్చే సందేశంతో పాటు కొన్ని సందర్భోచిత దృశ్యాలు అందరినీ అలరించాయి. మండల కేంద్రంలో రద్దీ వాతావరణం ఏర్పడింది.

వైఎస్సార్ సీపీని ఆదరించండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పుచ్చలమిట్ట, అద్దంకి రోడ్డులో మన ఊరు మనశివన్న కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలు వారి పాలిట వరాలని చెప్పారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, వెన్నపూస బాపిరెడ్డి, కర్లా మహేశ్వరి పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని యర్రగొండపాలెం సీఐ రాయుడునాయక్ అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో ఎస్ఐ ఫాతిమా బేగం ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పట్టణంలో పలుచోట్ల పోలీసులు కవాతు చేశారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

మార్కాపురం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఇందిరా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్ సూచించారు. బుధవారం కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువకేంద్రం ప్రతినిధి సాయి సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పుష్పలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లేష్, రాయల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.